# ఘనంగా సమీక్షా ఆర్ట్స్ అకాడమీ ముగింపు వేడుకలు

**రామకృష్ణాపూర్-నవభూమి:**పట్టణంలోని స్థానిక ఆల్ఫాన్సా కాన్వెంట్ హై స్కూల్ నందు సమీక్షా ఆర్ట్స్ అకాడమీ వారిచే నిర్వహించబడుతున్న సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా జ్యోతి ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడారు.విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను,గురువులను, అకాడమీ చైర్ పర్సన్ అకాడమీ డైరెక్టర్ ను ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం సమీక్షా ఆర్ట్స్ అకాడమీ చైర్ పర్సన్ ఎర్రవెల్లి మెర్సీరాణి మాట్లాడుతూ, ఆల్ఫాన్సా కాన్వెంట్ హై స్కూల్ నందు సమ్మర్ క్లాస్ ప్రారంభించి ఈ రోజుతో 31 రోజులు విజయవంతం కావటం జరిగిందని అన్నారు.15 డిపార్ట్మెంట్స్ విజయవంతం కావటానికి సహకరించిన గురువులకు, పిల్లల పేరెంట్స్, ఆల్ఫా కాన్వెంట్ హై స్కూల్ కరెస్పాండెంట్ సిస్టర్ శీన, హెడ్ మినిస్టర్ సిస్టర్ బ్లేస్సీ,సిస్టర్ శశి ఫాల్, సిస్టర్ టెన్సి, మీడియా మిత్రులకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ రెండవ ఎస్సై లలిత, ఏ ఎస్ ఐ వెంకన్న,కూచిపూడి మాస్టర్ డాక్టర్ ఎండి మోహినుద్దీన్, కరాటే మాస్టర్ చైతన్య, యోగ మాస్టర్ ఎమ్మెస్సీ గర్మిళ్ల శ్రీనివాస్ రెడ్డి, షిరిడి సాయిబాబా నాటక కళామండలి ఫౌండర్ మాలకొండయ్య,కర్రసామ్ మాస్టర్ రాహుల్, మార్షల్ ఆర్ట్



మాస్టర్ భారతి, వెస్టన్ బ్రేక్ మాస్టర్ దుర్గా స్వామి, మాక్స్ కేర్ హాస్పిటల్ డాక్టర్ నాగరాజు, రాఘవేంద్ర పిల్లల హాస్పిటల్ డాక్టర్ సతీష్ కుమార్, వసుధ హాస్పిటల్ డైరెక్టర్ ప్రశాంత్, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

### ఆర్డీవో సూర్యనారాయణ...





**కోదాడ జూన్ 3(నవభూమి ప్రతినిధి) :**భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి అని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గణపవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమం పరిశీలించి మాట్లాడారు. భూభారతి చట్టం లో ప్రభుత్వం అనేక వెసులుబాటు కల్పించింది అన్నారు. గతంలో బాగా పంపిణీ, కరెక్షన్ కావాలన్నా, ఫౌతీ కావాలన్నా సమస్యలను పట్టా చేయాలి అంటే జిల్లా రెవెన్యూ కు పోవలసిన పరిస్థితి నెలకొనేది అన్నారు. ప్రస్తుతం ఆ సమస్యలు ఆర్డీఓ తాసిల్దార్ సమక్షంలోనే పరిష్కారం అవుతాయని తెలిపారు. దరఖాస్తు రూపంలో ఇక్కడ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కచ్చితంగా ప్రతి ఒక్కరు రిసిప్ట్ తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వాజిద్ అలీ, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ హిమబిందు సుమన్ రెడ్డి, నారపురెడ్డి, కిరణ్, బండి కోటయ్య రెవెన్యు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది ఒత్తిడిని అధిగమించడానికి యోగా శిక్షణా తరగతులు



**సూర్యాపేట టౌన్ నవభూమి ప్రతినిధి :**శాంతి భద్రతల రక్షణ, ముఖ్యమైన బందోబస్తులు, పండగల విధులు, ప్రజల రక్షణ, మొదలగు నిత్య విధులతో పని ఒత్తిడి గురవుతున్న పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పోలీసు సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎస్పీ ఆదేశాను మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఈరోజు యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు, వారం రోజులపాటు పోలీసు సిబ్బందికి మానసిక ఒత్తిడిని అధిగమించే విధంగా యోగా తరగతులు ఉంటాయి. అర్మడ్ సిబ్బందితోపాటు విశ్రాంతిలో ఉన్న సిబ్బంది ఈ శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమం నందు నరసింహ చారి, యోగ శిక్షకులు పాపిరెడ్డి గురూజీలు, సిబ్బంది ఉన్నారు.

# బంగారుగడ్డలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ నవభూమి జూన్ 3:-** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డ ప్రాంతంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నూతన ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ మానవ జీవన శైలిలో వ్యాయామం అనేది చాలా ప్రధానమైనదన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలం కూడా పెరిగి రోజంతా యాక్టివ్ గా ఉంటామన్నారు.ఆరోగ్యంగా కూడా బలంగా ఉండేందుకు వ్యాయామం చాలా అవసరమన్నారు. ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్ నీ బంగారు గడ్డ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.స్కైల్యాబ్ నాయక్, మాజీ కౌన్సిలర్ చిలుకూరి సక్కుబాయి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్ దేశిడి శేఖర్ రెడ్డి, గిరిధర, జావిద్, గంధం రామకృష్ణ, బంగారుగడ్డ ప్రజలు కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు

# లబ్ధిదారులకు 3రోజుల్లోగా అందించాలి

◆ 9నుండి ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో ముగ్గు పోసిన ఫోటోలను తీసి అప్లోడ్ చేయాలి :జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ నవభూమి ప్రతినిధి జూన్ 03 :**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పాత్రలనులబ్ధి దారులకు మూడు రోజుల్లోగా అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన శక్తి అభియాన్ సౌత్ జోన్ ఎంపిక అవడం జరిగిందనీ 25 లక్షల గ్రాంట్ అవార్డు ద్వారా అందనున్నదని దాంతో ప్రతి గ్రామంలో గత 2 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి 30 పనులు సిద్ధం చేసుకోవాలన్నారు.జాతీయ కుటుంబలబ్ధిపథకం క్రిందఅర్హులైన రైతులను ఒంటరి మహిళలను కుటుంబ సభ్యులను తక్షణమేగుర్తించాలని మండలం నుండి100కుపైగాదరఖాస్తులుఅందించాలి .అని తెలిపారు.భూభారతి సదస్సులను వేగవంతంగా చేపడుతున్నామని ఇప్పటి వరకు14 గ్రామాల్లో భూభారతి సదస్సులు నిర్వహించామని. 699 ప్రజల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు.సన్నబియ్యంపై తాసిల్దార్ ప్రతిరోజు డీలర్లతో సమీక్షలు నిర్వహించి షాపుకు సన్నబియ్యం అందించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్ ,రోహిత్ సింగ్, సంబంధిత అధికారులకు కలెక్టర్ జూమ్ మీటింగ్ నిర్వ హించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత అంశాలైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని, మూడు రోజుల్లో మంజూరు పత్రాలుఅందించడం పూర్తిచేయడం జరుగు తుందన్నారు 9వ తేదీన ఇంద్ర మహిళ నిర్మాణాలకు ఆన్లైన్ యాప్ లో ముగ్గు పోసే ఫోటోలను అప్లోడ్ చేయడంజరుగుతుందని ఆన్నారు. జలశక్తి అభియాన్ సౌత్ జోన్ క్రింద ఎంపి కావడం జరిగిందని 25 లక్షల గ్రాంట్ అవార్డు ద్వారా వచ్చిందన్నారు.క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణకు సిద్ధంగా ఉండాలనిఅధికా రులకు సూచించా మన్నారు.కేంద్ర బృందం గ్రామాల్లో పర్యటించి జల శక్తి అభయాన్ పనులుపర్యవేక్షించనున్నందున గత 2 సంవత్సరాలుగా చేపట్టిన పనులు సిద్ధంగా ఉంచాలన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మిస్తామన్నారు మండల స్థాయి మేస్త్రీలతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణాలను ప్రణాళికప్రకారం చేపడతామన్నారు.భూభారతి సదస్సులలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తులను పూర్తిచేసి రికార్డులతో పాటు జూన్20 లోగా పూర్తి చేస్తామన్నారు.ఇప్పటివరకు 14 గ్రామాల్లో భూభారతి సదస్సులు నిర్వహించి 699సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు ఈరోజు జనగామ మండలం పెంబర్తి, లింగాల గణపురం మండలం నాగారం గ్రామాలలోపర్యటించిసదస్సులలో పాల్గొనడం ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం జరిగిందన్నారు.జాతీయ కుటుంబ లబ్ది పథకం కింద అర్హులైన రైతులను ఒంటరిమహిళలనువారికుటుంబ సభ్యులను స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా గ్రామ పంచాయతీ ద్వారా గుర్తించడంజరుగుతుందన్నారు.ఆధారాలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయము నుండి వచ్చిన విజ్ఞప్తులను త్వరితగతిన పరిష్కరించాలని జాప్యం చేయరాదన్నారు.

# సీపీఐ పట్టణ కార్యదర్శిగా మిట్టపెల్లి శ్రీనివాస్

**రామకృష్ణాపూర్-నవభూమి :**సీపీఐ పట్టణ కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 80 మంది ప్రతినిధులతో ప్రతినిధుల సమావేశం నిర్వహించి 45 మంది పట్టణ కౌన్సిల్,17 మంది కార్యవర్గం ఎన్నిక చేశారు.ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి గా మిట్టపల్లి శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇటీవల ఏర్పాటు చేసిన పట్టణ మహాసభలో చేసిన తీర్మానాలను జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ప్రకటించారు.క్యాతనపల్లి మున్సిపాల్టీ లొ స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని,ప్రైమరీ హెల్త్ సెంటర్లో సిబ్బందిని నియమించాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గతంలో కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని నిరుపేదలకు మనిషికి 200 గజాల చొప్పున ఇవ్వాలని తెలిపారు.అన్ని వార్డులలో సిసి రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని,ఫ్లైఓవర్ బ్రిడ్జ్ మీద స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరారు.సింగరేణి ఠాగూర్ స్టేడియంలో అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ జిమ్ ఏర్పాటు చేయాలని,రిటైర్డ్ కార్మికులకు సింగరేణి క్వార్టర్లు ఇవ్వాలని అన్నారు.నాగపూర్ ప్యాసింజర్ రవీంద్రఖని స్టేషన్లో హల్టింగ్ ఇవ్వాలని గ్రామాలకు సంబంధించి అన్ని వార్డులలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని 76 జీఓ లో ఆగిన పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆసరా పెన్షన్లు బ్యాంకుల ద్వారా ఇవ్వాలని గ్రంధాలయాన్ని ఏర్పాటు చేయాలని,పట్టణం నుండి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని గద్దరాగడి,భగత్ సింగ్ నగర్ ఏరియాలో ఉన్న హై టెన్షన్ వైర్లు



తొలగించాలని,సింగరేణి యాజమాన్యం అండర్ గ్రౌండ్ మైన్స్ తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని తీర్మానాలను అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడానికి పార్టీ కృషి చేస్తుందని ప్రజా ప్రతినిధులు కూడా స్పందించి పై సమస్యలు పరిష్కరించాలని కోరారు.అనంతరం మిట్టపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ మహాసభల విజయవంతంకు కృషిచేసిన పార్టీ శ్రేణులకు, సానుభూతిపరులకు ఆర్థికంగా సహకరించిన పూర ప్రముఖులకు ధన్యవాదాలు తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీ ప్రజాసంఘాల నిర్మాణానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, మిట్టపల్లి పౌలు ,నక్క వెంకటస్వామి కాదండి సాంబయ్య ఎగుడ మొండి ,మాదాస్ శంకర్, మారపల్లి రవి ,బోయబోతుల కొమురయ్య ,గురువయ్య కె దేవానంద్ , మురళి కౌడగాని సాంబయ్య, మామిడి గోపి, చీర్ల ముకుంద రెడ్డి,గంగదారి మల్లయ్య, మోతే రాయాలింగు, పొత్తర్ల రాములు, ఈరవేని రవీందర్ పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం రోల్‌మోడల్

**సూర్యాపేట-నవభూమి)::** తెలంగాణ రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడ మే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భా వ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. సీఎం రేవంతరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వ ర్గం రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన డాక్యుమెంట్ విశిష్టత ఎంతో




గొప్పదన్నా రు. సంక్షేమం, సామాజిక న్యాయం, గ్రీన ఎనర్జీ, ఇన్నోవేషన, ఇండస్ట్రీ, టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని అన్నా రు. గడిచిన 18నెలల్లో 25,35,964 మందికి రూ.20,617 కోట్ల రుణమాఫీ అమలుచేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి న తర్వాత వానాకాలం, యాసంగి పంటల దిగుబడి యావత భారత దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టిందన్నారు. పండించిన పంట ను ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యానికి 24గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలో నగదు జమచేశామన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి ముత్యాల బ్రాంచ కెనాల్, జానపహాడ్ బ్రాంచ కెనాల్‌తో పాటు పలు ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సంవృద్ధిగా నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీ, గృహజ్యోతి పథకం కింద ఉచితంగా 200యూనిట్ల వరకు ప్రతి కుటుంబానికి విద్యుతను ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. పేదల కళ్లలో ఆనందం చూసేందుకు అర్హులైన ప్రతి నిరుపేదకు ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.10కోట్ల మందికి, రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు నెలలకు కలిపి 18కిలోల బియ్యం, అంత్యోదయ లబ్ధిదారులకు 105 కిలోలు, అన్నపూర్ణ లబ్ధిదారులకు 30కిలోల బియ్యం ఒకేసారి అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, అర్హులైనవారు ఇఌ్ల నిర్మించేందుకు రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషనకార్డులు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, మౌలిక సదుపాయాల కల్పనతో నూతనంగా ఆసుపత్రులు, క్రిటికల్ కేర్ బాక్సులు, నర్సింగ్ కళాశాలలు నూ తనంగా నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబా ద్ నగరాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకుగ్లోబ ల్ సమ్మిట్, మిస్ వరల్డ్, బయోఆసియా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సాగుకు సమృద్ధికి నీరు జిల్లాలో 5,85,464 ఎకరాల వ్యవసాయ భూ మి సాగులోకి వచ్చిందని, అందుకు అవసరమై న నీటిని నాగార్జునసాగర్ ఎడమకాల్వ, మూసీ, ఎస్సారెస్పీ సెకండ్‌ఫేజ్ నుంచి అందించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, కొత్తఎత్తిపోతల పథకాల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.755.35 కోట్ల విలువైన 3,25,601లక్షల మెట్రిక్ టన్నుల... ధాన్యం కొనుగోలు చేసి రూ.550.54 కోట్ల నగదు ను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. సన్నా లు పండించిన రైతులకు ప్రభుత్వం కింటాకు రూ.500 బోనస్ కింద 7,128 మంది రైతులకు రూ.25.17కోట్లు చెల్లించామన్నారు. 627 మంది రైతులకు 1,876 ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన కోసం రూ.3.58కోట్ల సబ్సిడీని అందించినట్లు తెలిపారు. 1,54,220 లక్షల మంది రైతులకు రూ. 116.42 కోట్ల వ్యయంతో ఉచిత విద్యుత కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన వారందరికీ తెల్లరేషనకార్డుల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లా ఉంచి అందిన 22,913 దరఖాస్తులకుగాను ఇప్పటివరకు 9,529 దరఖాస్తులకు ఆమోదం లభించిందన్నారు. విద్యారంగంలో రూ.20.40కోట్లతో 571 పాఠశాలలను ఆధునికీకరించినట్లు తెలిపారు. నీటిపారుదల రంగం నుంచి విద్యావ్యవస్థ వరకు ప్రక్షాళన చేసి 2047 నాటికి రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ.23,73,00,000ల విలువైన చెక్కును మెప్మా సిబ్బందికి అందజేశారు. అనంతరం వివిధ శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు. ఇటీవల పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజ్‌సనందలాల్ పవార్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ పీ రాంబాబు, వివిధశాఖల అదికారులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్ ఇద్దరిపై కేసు నమోదు



**మిర్యాలగూడ నవభూమి, జూన్ 3:-** నమ్మదగిన సమాచారం మేరకు మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామశివారులో మంగళవారం మధ్యాహ్నం అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు తడకమళ్ళ గ్రామశివారులో పెట్రోలింగ్ సిబ్బంది వెళ్లగా ఒక ట్రాక్టర్లో ఇసుక నింపుకొని వస్తూ పోలీసులను చూసి ట్రాక్టర్ ను వదిలి పారిపోయారన్నారు. ట్రాక్టర్ కు ఎటువంటి నెంబర్ లు లేవన్నారు. ట్రాక్టర్ డ్రైవరు, యాజమాని వివరాలు తెలుసుకోనగా నేరేడుచర్ల మండలం దాచారం గ్రామానికి చెందిన పేర్ల కార్తీక్ దని తెలిసినదన్నారు. ట్రాక్టర్ను పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పేకాట రాయుళ్ళ అరెస్టు

**మిర్యాలగూడ నవభూమి జూన్ 3:-** మిర్యాలగూడ మండలం సోమవారం రాత్రి 10 గంటలకు గుబ్లీ కాలనీ రాజీవ్ నగర్ లో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంపై దాడి చేసి 8 మందిని పట్టుబడి చేసి వారి నుండి 7600 రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, 104 ప్లేయింగ్ కార్డులు, గ్రౌండ్ న్యూస్ పేపర్ షీట్ ను స్వాదీన పర్చుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

# ఐనపూర్‌లో టిబి ముక్తాభియాన్ కార్యక్రమం

### పలు రోగాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించిన వైద్యులు




**పరిగి,జూన్ 3 (నవభూమి)** టీబి ముక్త అభియాన్ కార్యక్రమము దోమ మండల పరిధిలో ని ఐనాపూర్ సబ్ సెంటర్ లో 100 రోజుల పాటు టిబి ముక్తాభియాన్ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి రక్తపోటు హెచ్ఐవి ధూమపానము మధుమేహము తదుపరి వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే అవసరమైన వారికి ఎక్స్రే పరీక్షకు 20 మందిని వికారాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపించి పరీక్షలు అవసరమైన వారికి చేయిండం జరుగుతుందనారు. 15 రోజుల పైబడిన వారికి దగ్గు ఛాతిలో నొప్పి జ్వరము బరువు తగ్గుట ఆయాసము ఉన్నవారు కచ్చితంగా తెమల పరీక్ష చేయించుకోవాలి అని పౌష్టికాహారం కొరకు ప్రతి టిబి పేషెంటుకు 1000 రూపాయలు ప్రతి నెల వారి బ్యాంకు ఖాతాలో జమ చేయబడును అని వీరికి 6 నెలలు మందులు ఉచితంగా అందించి అదేవిధంగా హెచ్ఐవి తో ఉన్న ప్రతి ఒక్కరూ తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమము 100 రోజులు టిబి అవగాహన కల్పించడం సర్వే చేయించి పేషెంట్స్ ను గుర్తించడం వారికి మందులు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా టిబి అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రజిత మెడికల్ ఆఫీసర్ సి హెచ్ ఓ విజయలక్ష్మి ఎచ్ ఈ ఓ ప్రభూలింగం హెల్త్ సూపర్వైజర్ నిర్మల, ఎస్టిఎల్ఎస్ నవీన్ గౌడ్ ఎస్ టి ఎస్ గోపాల్ టిబి హెల్త్ విజిటర్ రాజు నాయక్ మరియు కవిత ఏఎన్ఎం ఆశలు ప్రజలు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు

### మంగపేట తహసిల్దార్ తోట రవీందర్

**మంగపేట,జూన్ 03(నవభూమి):** భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసిల్దార్ రవీందర్ అన్నారు. మండలంలో మంగళవారం రమణక్కపేట, గొల్లగూడెం (డి),కోమటిపల్లి గ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు రైతుల నుంచి భూ సమస్యలు, పాస్ బుక్కు సమస్యలు, రీ సర్వే, ముటేషన్ కు సంబంధించిన తదితర అంశాలపై పలువురు రైతులు నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తాసిల్దార్ రవీందర్ , మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సందేహాలను సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలను చేసారు. డాక్యుమెంట్లు లేనివారు మరియు పూర్వం తప్పులు పడిన వాటికి సంబంధించినవి సరిచేసు కోవాలిని తెలిపారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకొని పట్టాదారు, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఆర్ ఐ లు ఏసుపాదం, శ్రీనివాస్, రెవిన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు,గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.





# న్యాయం జరిగేందుకు కృషి చేస్తా..

**ధర్మసాగర్-నవభూమి):**ప్రజలందరికీ న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తానని తాసిల్దార్ సదానందం అన్నారు. మంగళవారం మండలంలోని సోమదేవరపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవిన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో 95 దరఖాస్తులు అందాయి. వీటిలో 2 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం జరిగింది. ఈ సమావేశంలో ఎక్కువగా సాదా బైనామా కేసులు ఉండగా, 4 సక్సేషన్ కేసులు మరియు 4 ఆర్ ఓ ఆర్ అపిల్ కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రెవిన్యూ అధికారులు గ్రామ ప్రజలతో సమన్వయం చేస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి సదస్సులు ప్రజల సమస్యలపై అర్థం చేసుకోవడానికి మరియు స్పందించడానికి మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రజలందరూ ఈ సదా అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సు విజయవంతంగా నిర్వహించబడటంపై సంబంధిత అధికారులు మరియు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఇతర ఇద్దరు గిర్దావారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పశువుల ఆస్పత్రులకు మందులు రాక ఆరు మాసాలు

**మోత్కూరు-నవభూమి)::** దేశానికి రైతే వెన్నుముక. ఆ రైతుకు వెన్నుముక పశుసంపద. నేడు ఆ వెన్ను విరిగి, రైతుల పరిస్థితి దీనంగా మారుతోంది. కంటికి రెప్పలా, ఇంట్లో సభ్యుల మాదిరి కాపాడుకుంటున్న పశుసంపదకు ఆపదొస్తే ఆదుకునే వారు లేక కర్షకులు అతలాకుతలమవుతున్నారు. పశువులకు కనీసం తినేందుకు మేత కరువై, రోగమొస్తే మందులు లేక, అత్యవసరమైతే ఆస్పత్రిలో వైద్యుడు లేక ఆ మూగ జీవాలు రోదిస్తున్న తీరు చూసి రైతు కంటతడి ఆరడంలేదు. జిల్లావ్యాప్తంగా పశువైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం, వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడం, అటెండర్లే వైద్యులుగా మారుతుండడం అగమ్యగోచరంగా మారింది.మూగ జీవాలకు చికిత్స చేయడానికి ఉన్న ఆస్పత్రులే తక్కువ. ఆ కొద్దిపాటి ఆస్పత్రుల్లోనూ సిబ్బంది కొరత. మండలకేంద్రాల్లోని పశువైద్యశాలలకు, గ్రామాల్లోని గ్రామీణ పశువైద్యశాలలకు (సబ్ సెంటర్లకు) నెల తరబడి మందులు సరఫరా కావడంలేదు. ఫలితంగా మూగజీవాలకు జబ్బుచేస్తే మందులు ప్రైవేటుగా కొని తెచ్చుకోవాల్సివస్తోందంటున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పశువుల ఆస్పత్రుల పని తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన జరుపగా పలు ఆసక్తి కర విషయాలు వెలుగులోకి వచ్చాయి.మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో..మోత్కూరులో ఏడీ స్థాయి పశువైద్యశాల ఉంది. ఇందులో ఉండే ఏడీగాని, వెటర్నరీ అసిస్టెంట్ గాని ఆస్పత్రికి తీసుకొచ్చిన పశువులకే చికిత్స చేస్తారు. మండలంలోని గ్రామాల్లో మూగ జీవాలు నడవలేని పరిస్థితి ఉన్నా, చూడి పశువులు ఈనడం కష్టమైనా వారు చికిత్స చేయడానికి క్షేత్రస్థాయికి వెళ్లరు. మండల వైద్యాధికారి వెళ్లాల్సి ఉంటుంది. మోత్కూరు మండలంలో 10 గ్రామాలుండగా మండలంలో వెటర్నరీ డాక్టర్ స్థాయి ఆస్పత్రి లేదు. గతంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు అడ్డగూడూరు ఆస్పత్రిలో ఉన్న వైద్యుడే ఉమ్మడి మండలాన్ని చూసేవారు. అడ్డగూడూరు మండలం వేరయ్యాక మోత్కూరు మండలానికి ఆస్పత్రి లేక డాక్టర్ లేకుండాపోయారు. అడ్డగూడూరు, కూరెళ్ల, ఆత్మకూరు(ఎం) ఆస్పత్రుల్లోని డాక్టర్లలో ఎవరో ఒకరికి మోత్కూరు మండలాన్ని ఇన్ చార్జి ఇస్తున్నారు. గ్రామాల రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు చికిత్సకు సలహాలు తీసుకోవడానికైనా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందడానికైనా మండలం దాటి వేరే మండలానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మోత్కూరు మునిసిపల్ కేంద్రంలోని పశు వైద్యశాల ఏడీని జిల్లాకేంద్రానికి ఇన్ చార్జి జేడీగా పంపారు. మోత్కూరు పశువైద్యశాలను ఆత్మకూరు(ఎం) డాక్టర్ కు ఇన్ చార్జి ఇచ్చారు. మోత్కూరు



మండలంలో దత్తప్పగూడెంలో ఒక సబ్ సెంటర్ (గ్రామీణ పశువైద్యశాల) ఉంది. అందులో వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి దత్తప్పగూడెం గ్రామీణ పశువైద్యశాలను ఆస్పత్రి స్థాయికి పెంచడానికి కృషి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ విషయమే మరుగున పడింది. అనాజిపురం లేదా పాటిమట్లలో వెటర్నరీ డాక్టర్ ఉండేస్థాయి పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని మండలంలోని గ్రామాల రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కోరతున్నారు.ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత..అడ్డగూడూరు మండలకేంద్రంలో ఒక డాక్టర్ స్థాయి ఆస్పత్రి, కంచనపల్లి, చిన్నపడిశాల గ్రా మాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. మండలకేంద్రంలోని ఆస్పత్రిలో డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్ ఉం డగా అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. చిన్నపడిశాల సబ్ సెంటర్ లో సిబ్బంది ఎవరూ లేరు. కంచనపల్లి ఎల్ఎసఏకు ఇన్ చార్జి ఇచ్చారు. ఆయన ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా ఇలా వచ్చి అలా వెళ్లిపోతారని చెబుతున్నారు. ఎక్కువ రోజులు ఆస్పత్రికి తాళం వేసే ఉంటుందంటున్నారు. మండలంలోని వెల్దేవి, మానాయకుంట, గట్టుసింగారం ప్రాంతంలో ఒక సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కోరుతున్నారు.తిరుమలగిరి మండలంలో ఒక ఆస్పత్రి, ఒక సబ్ సెంటర్, నాగారం మండలంలో రెండు ఆస్పత్రులు, నూతనకల్ మండలంలో రెండు ఆస్పత్రులు, మద్దిరాల మండలంలో ఒక ఆస్పత్రి, అర్వపల్లి మండలంలో ఒక ఆస్పత్రి, ఒక సబ్ సెంటర్ ఉన్నాయి.డాక్టర్లు ఉన్నా, ఇతర సిబ్బంది కొరత ఉంది. మద్దిరాలలో ఒక సబ్ సెంటరైనా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.ఆస్పత్రులకు మందుల సరఫరా లేక ఆరు నెలలుతుంగతుర్తి నియోజకవర్గంలోని పశువుల ఆస్పత్రులకు, మోత్కూరు, తుంగతుర్తిలోని ఏడీ స్థాయి పశువైద్యశాలలకు ఆరు నెలలుగా అవసరమైన మందులు సరఫరా చేయడం లేదంటున్నారు. డాక్టర్లు ఇండెంట్ పెడుతున్నప్పటికీ మందులు సరఫరా కావడం లేదంటున్నారు. ఏడాదికి నాలుగు క్వార్టర్లుగా (మూడు మాసాలకోసారి) ఆస్పత్రులకు మందులు సరఫరాచేస్తా రు. గత రెండు క్వార్టర్లకు ఆస్పత్రులకు మందు లే సరఫరా కావడం లేదని డాక్టర్లు చెబుతున్నా రు. సుమారు రెండేళ్లుగా గొర్రెలు, మేకలకు నట్ట ల నివారణ మందులు ఆస్పత్రికి రావడం లేదంటున్నారు. నియోజకవర్గంలో పశువుల కన్నా గొర్రెలు, మేకల పెంపకం ఎక్కువ. ఏడాదికి రెం డు పర్యాయాలైనా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించాలి. రెండేళ్లుగా ఆస్పత్రులకు నట్టల నివారణ మందులు సరఫరా కాకపోవడంతో తామే దుకాణాల్లో కొని తెచ్చుకుంటున్నామని పలువురు గొర్రెలు, మేకల పెం పకం దారులు చెబుతున్నారు. పశువులు, గొర్రె లు, మేకలకు జబ్బు చేసినప్పుడు ఆస్పత్రికి తీసుకెళితే మందులు లేవంటున్నారని, 75శాతం మందులు రాసి ఇస్తే ప్రైవేటు దుకాణాల్లో కొని తీసుకెళ్లి ఇప్పించుకుంటున్నామని వాటి పెంపకందారులు చెబుతున్నారు. గడ్డి విత్తనాలు తమ ఆస్పత్రులకు సరఫరా చేయరని, ప్రభుత్వం జిల్లాకేంద్రానికి పంపితే తమ సొంత ఖర్చుతో తెచ్చుకోవాల్సి వస్తున్నదని డాక్టర్లు చెబుతున్నారు.నట్టల నివారణ మందులూ ఇవ్వడం లేదు : దండెబోయిన శ్రీశైలం, గొర్రెల పెంపకందారు, కొండగడపగొర్రెలకు యేడాదికి రెండు సార్లు అయినా నట్టల నివారణ మందు తాగించాలి. సుమారు రెండేళ్లుగా పశువుల డాక్టర్లు నట్టల నివారణ మందు ఆస్పత్రులకు రావడం లేదని చెబుతున్నారు. నేనే దుకాణంలో నట్టల నివారణ మందు కొని తెచ్చుకుని గొర్రెలకు తాగిస్తున్నా. ఆస్పత్రుల్లో ఏ మందులూ లేవంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువుల ఆస్పత్రులకు అన్ని రకాల మందులు సరఫరా చేయాలి.ఆస్పత్రికి వెళ్లితే మందులు లేవంటున్నారు : నాగుల రవి, రైతు, ఆరెగూడెం నాకు గొర్రెలు, పాడి గేదెలు ఉన్నాయి. వాటికి జబ్బు చేసినప్పుడు ఆస్పత్రికి తీసుకెళితే ఆస్పత్రిలో మందులు లేవని కొనుక్కొని తీసుకరమ్మని రాసి ఇస్తున్నారు. ఎప్పుడు ఆస్పత్రికి వెళ్లినా ఇప్పుడు మందులు లేవంటున్నారు. ఎప్పుడొస్తాయని అడిగితే ఇంకో రెండు నెలలకు వస్తాయంటున్నారు. మందులు లేని పశువుల ఆస్పత్రి ఉండి ఏం లాభమో అర్థం కావడంలేదు. ఏ చిన్న జబ్బు చేసినా మందులు దుకాణంలో కొని తెచ్చుకుంటున్నాం.

## ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

### జిల్లా ఉద్యానవన శాఖ, పట్టణ పరిశ్రమ అధికారి డి. సంజీవ రావు



**మంగపేట, జూన్ 03(నవభూమి):** ములుగు జిల్లా ఉద్యానవన శాఖ, పట్టణ పరిశ్రమ అధికారి డి. సంజీవ రావు మంగళవారం ములుగు జిల్లాలోని వివిధ గ్రామాల్లో సాగుచేస్తున్న ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. మంగపేట మండలం మల్లూరు రెవెన్యూ విలేజ్ గాంధీ నగర్ లో మూడు ఎకరాల్లో ఆచంట వెంకట కృష్ణ రావు సాగుచేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను సందర్శించి డ్రిప్ నిర్వహణ, ఎరువులు, నీటి నిర్వహణ గురించి, అంతర పంటల సాగు గురించి వివరించారు. అలాగే మంగపేట మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన చిల్లి ప్రాసెసింగ్ యూనిట్ ను సందర్శించారు. వెంకటాపూర్ మండలంలోని గుంటూరు పల్లి లో మోతె సరోజన, కర్రి దేవేందర్ రెడ్డి 3.20 ఎకరాల్లో సాగుచేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను సందర్శించారు. ఆ రైతు సంతోషం వ్యక్త పరుస్తూ డ్రిప్ వల్ల ఉపయోగం ఉందని సరోజన అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యాన అధికారి జె. శ్రీకాంత్,లావణ్య, ఏటూరునాగారం ఉద్యాన వన అధికారిని లావణ్య,ఉద్యాన విస్తరణ అధికారి రమేష్, సిబ్బంది సాంబాశివరావు,జైన డ్రిప్ కంపెనీ వారు పాల్గొన్నారు.

## తడి పొడి హానికర చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదు

### క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు

**రామకృష్ణాపూర్-నవభూమి :**తడి, పొడి, హానికర చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు అన్నారు.పట్టణంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల పలు ప్రదేశాల్లో 30 తడి పొడి హానికరమైన చెత్త డబ్బాలను అమర్చడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రజలు పరిసర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన మూడు రకాల చెత్త డబ్బాలలో చెత్తను వేరుచేసి వేరు చేయాలని కోరారు. లేనియెడల చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసినట్లయితే భారీ జరిమానా విధించి చర్యలు తీసుకోబడతాయని ఒక ప్రకటనలో తెలియజేసారు.

## చిరు ధాన్యాలను పండించే రైతులకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే వేముల వీరేశం



**నకిరేకల్-నవభూమి :**చిరు ధాన్యాలను పండించే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నకిరేకల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 'గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గస్థాయి విత్తన పంపిణీ కార్యక్రమంలో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు వరి, పెసర నాణ్యమైన విత్తనాల కిట్లను ఎమ్మెల్యే వీరేశం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనంతోనే రైతుకు లాభం చేకూరుతుందన్నారు. పంటలకు ఎరువుల మోతాదును తగ్గించే విధంగా వ్యవసాయ ప్రణాళిక పద్ధతిలో సూచనలను రైతులు పాటించాలన్నారు.భూసారం దెబ్బతినడంతో కంపోస్ట్ ఎరువుల విధానంతో చేసే వ్యవసాయమే ఉత్తమమన్నారు. అనంతరం పంపిణీ చేస్తున్న వరి(కెఎన్ఎం 1638), పెసర(ఎంజిజి 385) సాగు పద్ధతుల గురించి రైతులకు పలువురు శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు నాగులవంచ వెంకటేశ్వరరావు, నంద్యాల భిక్షంరెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎండి జానిమియా, పిజెటిఎస్ఎయు శాస్త్రవేత్తలు కెవి రామాంజనేయులు, శంకర్, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతమే టీఎస్‌యూటీఎఫ్ లక్ష్యం : సీహెచ్ రామలింగయ్య



**చండూరు-నవభూమి :** ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యమని యూటీఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామలింగయ్య అన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మన ఊరి ప్రభుత్వ బడి ముద్దు ప్రైవేట్ బడి వద్దు అనే నినాదంతో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధనతో పాటు ఉచిత దుస్తులు, మధ్యాహ్న భోజనమం, ఉచిత పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు.ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తూ వారి అంగీకారంతో పాఠశాల నడుపుతున్నట్లు చెప్పారు. పిల్లల అభివృద్ధిని ఊరి అభివృద్ధిగా భావిస్తూ ప్రభుత్వ పాఠశాల పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గేర నరసింహ, మునుగోడు మండలాధ్యక్షుడు బికుమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి పెరిక నరసింహ, చండూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాంపల్లి సైదులు, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రయివేటుకు ధీటుగా పెద్దవూర జెడ్పీహైస్కూల్..

**పెద్దవూర-నవభూమి :**పేరుకే అది ప్రభుత్వ పాఠశాల. వసతుల్లో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నుతున్నది. ఇంగ్లిష్ మీడియం, కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు వంటి అనేక సౌకర్యాలు ఈ పాఠశాల సొంతం. 49 ఏండ్లుగా ఈ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు చూరగొంటున్నది. ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా, రాజకీయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక భూమిక పోషిస్తున్న వారు కూడా ఉన్నారు. ఇదే పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రత్యేకత. మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యనభ్యసించడానికి ఇక్కడ పోటీపడుతుంటారు. 1976లో ఈ పాఠశాల ప్రారంభమైంది. 2008 సంవత్సరం వరకు పాత భవనంలోనే పాఠశాల కొనసాగింది.జెడ్పి మాజీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి ప్రత్యేక శ్రద్ధ: జెడ్పి మాజీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి తండ్రి నారాయణ రెడ్డి పాఠశాలకు స్థలాన్ని కేటాయించి 1976లో పాఠశాల ప్రారంభం చేశారు. ఇదే పాఠశాలలో కర్నాటి లింగారెడ్డి విద్యనభ్యసించడంతో తాను చదివిన పాఠశాల రూపురేఖలు మార్చాలన్న ఉద్దేశంతో 2009లో అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించారు. పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులను కూడా ఆయన కల్పించారు. దీంతో ప్రస్తుతం జిల్లాలోనే పాఠశాలల్లో పెద్దవూర హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మధ్యలో నీడనిచ్చే చెట్లు ఆహ్లాదాన్ని కలిగిగిస్తున్నాయి. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. ప్రారంభంలో 1500 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యశించారు. గతంలో ఈ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టకముందు 900 విద్యార్థులుండగా.. ప్రస్తుతం 700 మంది విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ఈ పాఠశాలలో అడ్మిషన్‌కు విద్యార్థులు పోటీపడుతుంటారు. కొత్త తరహా విధానాలతో కూడా బోధిస్తుండడంతో కార్పొరేట్ పాఠశాలల్లో కూడా అందని విద్య ఇక్కడ అందుతోంది. దీంతో జిల్లాలోనే పెద్దవూర పాఠశాలకు మంచి గుర్తింపు లభించింది.-సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యాబోధన: ఎంఈఓ..తరి రాము 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే భవనానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశాము.ఎక్కడాలేని విధంగా పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతి గదికి సీసీ కెమెరాలను అమర్చారు. విద్యార్థులు ప్రతి క్షణం విద్య, పాఠశాలలో క్రమశిక్షణగా మలుచుకునేలా ఈ సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. ఉపాధ్యాయులంతా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చక్కటి విద్యాబోధన అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఆంగ్ల మాధ్యమాన్ని కూడా విద్యార్థులకు అందిస్తున్నాము. దీనికనుగుణంగానే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందుగానే ఈ కార్యక్రమాలను తీసుకుని జిల్లాలోనే ఆదర్శంగా నిలిపాము. దీనికితోడు పాఠశాల ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దాతల సహకారంతో అవసరమైన వాటిని సమకూర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు కంప్యూటర్, ఇంగ్లిష్ బోధన చేస్తున్నారు. దీంతో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్‌ను తలదన్నేలా ఫలితాలను సాధించి అద్భుతాలు సృష్టిస్తున్నారు.

# నిలిచిన నీరు.. రాకపోకలు బంద్

**ఆదిలాబాద్-నవభూమి :**ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల మండలాల మీదుగా మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బేల మండలంలోని ఉపాసనాల నుంచి భోరజ్ వద్ద జాతీయ రహదారి-44కు కలిపేలా నేషనల్ హైవే అథారిటీ అధికారులు 353-బీ జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. రూ.194 కోట్లతో 33 కిలోమీటర్ల నిర్మాణంలో భాగంగా రెండు వరుసల రహదారితోపాటు వంతెనల నిర్మాణం కొనసాగుతోంది.ఏడాది కిందట పనులు ప్రారంభం కాగా వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి కావాలి. రోడ్డు నిర్మాణ పనులపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వంతెనలు నిర్మించిన తర్వాత రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉండగా.. రహదారి పనులు అయిన తర్వాత తర్నం వంతెన నిర్మిస్తున్నారని పేర్కొంటున్నారు. తర్నం పాత వంతెన ఒక పిల్లర్ కుంగినా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేవారని, అధికారులు వర్షాకాలం ముందు బ్రిడ్జిని కూల్చివేసి రాకపోకలు జరగకుండా చేశారని వాహనదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రూ. 4.50 కోట్లతో నిర్మించినా ఫలితం శూన్యం రెండేండ్ల కిందట కురిసిన భారీ వర్షాలతో తర్నం వద్ద వంతెన కుంగిపోయింది. ఈ బ్రిడ్జిపై వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా అధికారులు రాకపోకలు నిషేధించారు. అప్పుడు వాహనాల రాకపోకల కోసం రోడ్డు వంతెన కింది భాగంలో రూ.39 లక్షలతో చిన్న కల్వర్టును నిర్మించారు. గతేడాది వర్షాకాలంలో కురిసిన వర్షాలతో ఈ వంతెన కొట్టుకుపోగా.. ఇటీవల రూ.4.50 కోట్లతో మరో వంతెన నిర్మించారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా వంతెనను నిర్మించాల్సి ఉండగా అధికారులు తక్కువ ఎత్తులో పైపులు వేసి నిర్మాణం చేశారు.ఇటీవల కురిసిన వర్షంతో ఈ వంతెన మీదుగా నీరు ప్రవహించి రాకపోకలు నిలిచాయి. నీటి ప్రవాహంలో వంతెన దాటడానికి ప్రయత్నించిన జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన యువకుడు కొట్టుకుపోయాడు. రూ.4.50 కోట్లతో నిర్మించిన వంతెన పనులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిపై చిన్నపాటి వర్షాలకే నీరు ప్రవహిస్తుందని, దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కోట్ల రూపాయలు వృథా..తర్నం వద్ద రూ.4.50 కోట్లతో నిర్మించిన వంతెల వల్ల వాహనదారులకు ప్రయోజనం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడు గల్లంతయ్యాడు. వర్షం నీరు వల్ల వాహనదారులకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి కట్టాల్సి ఉండగా అధికారులు నామ మాత్రంగా నిర్మించారు. రోజు వందలాది వాహనాల రాకపోకలు సాగించే జాతీయ రహదారి పనుల విషయంలో అధికారులు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.

## జాతీయస్థాయిలో సింగరేణికి స్థానం

**కొత్తగూడెం-నవభూమి :**ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులతోపాటు ఇతర ఖనిజ గనులను సాధించుకొని జాతీయస్థాయిలో సింగరేణి సంస్థ ఎదుగుతోందని సంస్థ సీఎండీ బలరాం అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ రన్‌ను ప్రారంభించి అమరవీరులకు నివాళులర్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎస్అండ్‌పీసీల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీఎండీ బలరాం మాట్లాడుతూ 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ఆరు జిల్లాల్లోని 11 ఏరియాల్లో, 39 భూగర్భ గనులు 41 వేల మంది కార్మికులతో ఏడాదికి సుమారు 700లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును అందిస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంతోపాటు ఒడిశా రాష్ట్రంలో కూడా ఏడాదికి మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసే గనిని ఈ ఏడాది ప్రారంభించుకోవడం సింగరేణి సంస్థకు చారిత్రాత్మక ఘట్టమన్నారు. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు ఉత్పత్తిలో అడుగుపెట్టి సింగరేణి సంస్థ జాతీయస్థాయిలో స్థానాన్ని దక్కించుకుందన్నారు.ప్రస్తుతం పోటీ మార్కెట్‌లో నిలబడాలంటే కనీసం టన్నుకు వెయ్యి రూపాయల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలన్నారు. పనివేళలను పూర్తిగా మార్చుకోవాలని, షిఫ్టు సమయం 8 గంటలు పూర్తిగా పనిచేయడంతోపాటు మనం వాడే యంత్రాలతో కూడా పని చేయించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీఎం వెల్ఫేర్ కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించగా డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం నుంచి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం నుంచి పీతాంబరరావు, సీఎంవోఏఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్‌కుమార్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జీఎంలు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్ : ఎమ్మెల్యే కూనంనేని

**రామవరం-నవభూమి:**ఎవరు అవునన్నా కాదన్నా తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర మరువలేనిదని కొత్తగూడెం శాసనసభ్యుడు, సీపీఐ పార్టీ రాష్ట్ర సెక్రెటరీ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఎత్తుగడలు, ఆయనకున్న వాక్ చాతుర్యంతో హింసాయుత సంఘటనలకు తావు లేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రగతి మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర సాధన సమయంలో కేసీఆర్ కు వెన్నుండి నడిపించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రొఫెసర్ కోదండరాం, విద్యాసాగర్, మేధావులు, కవులు, కళాకారులు, కార్మిక లోకం, కర్షక లోకం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వయోభేదం, లింగ భేధం లేకుండా కలిసి కొట్లాడం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు.తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. నాడు సకల జనుల సమ్మెలో 42 రోజుల పాటు పాల్గొని తెలంగాణపై వారికున్న మక్కువను చూపెట్టుకున్నట్లు తెలిపారు. తాను శాసనసభ్యుడిగా గెలిచానంటే అంటే అది సింగరేణి కార్మికుల దయే అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం కామ్రేడ్ శేషగిరిరావు, కొమురయ్య, విఠల్ రావు చూపెట్టిన మార్గంలోనే తాను పోరాడుతానని తెలిపారు.స్నేహంగా ఉన్నామని నోరు మూసుకుని ఉండం తెలంగాణకు ఆర్థికపరమైన సంక్షోభం ఎప్పుడూ కూడా లేదన్నారు. మనది ధనిక రాష్ట్రం, కానీ డబ్బులు చేతుల్లో లేవు, ఆస్తులు రూపంలో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయలేకపోతుంది. వారి సహాయంతో తాము గెలిచాం, మా సహాయంతో వారు గెలిచారు. స్నేహం స్నేహమే. స్నేహంగా ఉన్నామని నోరు మూసుకుని ఉండం. ప్రశ్నిస్తాం.. ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అనంతరం ఉత్తమ కార్మికుడిగా ఎన్నికైన ఆర్ సి హెచ్ పి కి చెందిన జక్కుల గట్టయ్యను సింగరేణి యాజమాన్యంతో కలిసి ఎమ్మెల్యే సన్మానించారు.

## సుదీర్ఘపోరాటంతోనే.. స్వరాష్ట్ర సాకారం

**రామవరం-నవభూమి :**సబ్బండ వర్గాల అండతో ఉద్యమసారథి కేసీఆర్ సుదీర్ఘకాలం చేసిన పోరాటం వల్లనే నాలుగున్న కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని వక్తలు పేర్కొన్నారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అనే నినాదంతో తెలంగాణ జనుల మద్దతుతో ఢిల్లీ పెద్దల మెడలు వంచిన కేసీఆర్.. స్వరాష్ట్ర కలను నిజం చేశారని గుర్తుచేశారు.తద్వారా వలస పాలకుల నుంచి విముక్తి కల్పించి సమస్త తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛావాయువులను ప్రసాదించారని జ్ఞప్తికి తెచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ సహా వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లా కేంద్రాల్లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయాలైన తెలంగాణ భవన్‌లలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

పోరుబాట నుంచి.. ప్రగతిబాట వైపు..ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఖమ్మం రూరల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, మణుగూరు, కొత్తగూడెంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఉద్యమనేత దిండిగాల రాజేందర్, దమ్మపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలంలో ఉద్యమ నాయకుడు మానే రామకృష్ణ, నియోజకవర్గ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ తదితరుల సారథ్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమసారథి కేసీఆర్ సుదీర్ఘకాలంపాటు చేసిన పోరాటంతోనే స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని గుర్తుచేశారు.
పయనించిందని జ్ఞప్తికి తెచ్చారు.